సాక్షి రంగారెడ్డి

ఆదివారం । 12 । మార్చి । 2023

అందని 'రైతుబంధు'

మోతుబరి రైతులు, భూస్వాములకు సంబంధించిన యాసంగి సీజన్ రైతుబంధు డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదు. 8లో▸

జేఎన్‌టీయూహెచ్‌లో సదస్సు

కేపీహెచ్‌బీకాలనీ: అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమాల్లో భాగంగా జేఎన్‌టీయూహెచ్‌లోని బయోటెక్నాలజీ విభాగంలో శనివారం జాతీయ సదస్సు నిర్వహించారు. బయోటెక్నాలజీ విభాగం, భారతీయ మహిళా సైంటిస్టు అసోసియేషన్ సంయుక్తాధ్వర్యంలో డాక్టర్ కె.రత్న, ఈసీ మెంబర్, ఐడబ్ల్యూఎస్ఏ ప్రొ. జయలక్ష్మి సదస్సును ప్రారంభించారు. జీవశాస్త్ర పరిశోధనలో మహిళల పాత్రపై మాట్లాడారు.

ఎయిర్‌పోర్టులో కారు బీభత్సం

శంషాబాద్: ర్యాష్ డ్రైవింగ్ కారణంగా శంషాబాద్ విమానాశ్రయంలో కారు బీభత్సం సృష్టించింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. శుక్రవారం రాత్రి ఎయిర్‌పోర్టు ప్రధాన రహదారిపై అత్యంత వేగంగా వచ్చిన కారు డివైడర్ మధ్యలో ఉన్న స్తంభాన్ని ఢీకొట్టడంతో పాటు పక్కనే ఉన్న ప్రకటన బోర్డులను సైతం ఢీకొంది. దీంతో కారు ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది.

న్యూస్‌రీల్

రేపటి 'ప్రజావాణి' రద్దు

ఇబ్రహీంపట్నం రూరల్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ హరీశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికల నేపథ్యంలో ఈవారం ప్రజావాణి ఉండబోదని పేర్కొన్నారు. 13న ఎన్నికలు ముగిసిన తర్వాత యథాతథంగా కొనసాగుతుందని తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించాలని కోరారు.

నిందితుడికి ఐదేళ్ల జైలు, రూ.50 వేల జరిమానా



అమిత్‌పాండే

శంకర్‌పల్లి: స్నేహితుడిపై దాడి చేసిన వ్యక్తికి చేవెళ్ల సబ్ కోర్టులో ఐదేళ్ల జైలు శిక్ష, రూ.50 వేల జరిమానా విధించారు. శంకర్‌పల్లి పోలీసుల వివరాల ప్రకారం.. పట్టణ కేంద్రంలోని సాయిబాబా ఆలయం వద్ద అమిత్ పాండే(28), అతడి స్నేహితుడు శ్యామాజీరావు(29) ఒకే గదిలో అద్దెకు ఉండేవారు. వీరి మధ్య విభేదాలు రావడంతో 2016 మే నెలలో అమిత్‌పాండే, శ్యామాజీరావుపై కత్తితో దాడి చేశాడు. తీవ్రగాయాలపాలైన బాధితుడిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. శ్యామాజీరావు తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ రామేశ్వర్‌రెడ్డి కేసు నమోదు చేసుకొని, నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించి పూర్వాపరాలు, సాక్ష్యాధారాలను పరిశీలించిన ఏఎస్‌జే (చేవెళ్ల సబ్ కోర్టు)అమిత్‌పాండేకు పైశిక్ష విధించారు. నిందితుడికి శిక్షపడేలా కృషి చేసిన శంకర్‌పల్లి సీఐ మహేశ్‌గౌడ్, ఎస్ఐ కృష్ణ, కానిస్టేబుల్ రమేశ్‌ను ఉన్నతాధికారులు అభినందించారు.

రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న కేంద్రం



కళాకారులతో నారాయణమూర్తి ఆటాపాట

ఇబ్రహీంపట్నం: డాక్టర్ అంబేడ్కర్ కల్పించిన రాజ్యాంగ హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని సినీ నిర్మాత, నటుడు, పీపుల్స్ స్టార్ ఆర్ నారాయణమూర్తి మండిపడ్డారు. ప్రజానాట్యమండలి జిల్లా 3వ మహాసభల సందర్భంగా ఇబ్రహీంపట్నంలో శనివారం రాత్రి నిర్వహించిన వీధి నాటకోత్సవాలకు (సఫ్దర్ హష్మీ ఓపెన్ థియేటర్ షార్ట్) ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పబ్లిక్ రంగ సెక్టార్లను ప్రైవేట్ పరం చేస్తోందని విమర్శించారు. ప్రజల సొమ్మును అంబానీ, ఆదానీలకు దోచిపెడుతున్నారని మండిపడ్డారు. కేంద్రం తీసుకొస్తున్న నూతన విద్యావిధానంతో పేద, మధ్య తరగతి పిల్లలు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తంచేశారు. అధికారంలోకి రాగానే స్విస్ బ్యాంక్‌లో దాచిన నల్ల ధనాన్ని వెలికితీసి ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త దేవి, సీపీఎం నాయకులు సామేల్, పగడాల యాదయ్య పాల్గొన్నారు.


సైకిల్ ట్రాక్ రెడీ

సాక్షి, సిటీబ్యూరో: ఔటర్‌రింగ్ రోడ్డు మార్గంలో అంతర్జాతీయ ప్రమాణాలతో చేపట్టిన సైకిల్ ట్రాక్ పనులు తుది దశకు చేరుకున్నాయి. ప్రస్తుతం ట్రాక్‌కు రెండు వైపులా ఆహ్లాదాన్ని పంచే పచ్చదనంతో పాటు, లాండ్‌స్కేప్ పనులు కొనసాగుతున్నాయి. ట్రాక్‌పై సోలార్ పానల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు హెచ్ఎండీఏ కమిషనర్ అర్వింద్‌కుమార్ శనివారం ట్విటర్ వేదికగా తెలిపారు. మరో 10 రోజుల్లో సోలార్ పానల్స్ ఏర్పాటు పూర్తి కానున్నట్లు పేర్కొన్నారు. దేశంలోనే మొట్టమొదటి అధునాతన సైక్లింగ్ ట్రాక్ హైదరాబాద్‌లో అందుబాటులోకి రానున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఔటర్ రింగ్ రోడ్డును ఆనుకొని 23 కిలోమీటర్‌ల మార్గంలో ట్రాక్ నిర్మాణం చేపట్టిన సంగతి తెలిసిందే. పర్యావరణ పరిరక్షణ కోసం సైక్లింగ్‌ను ప్రోత్సహించే లక్ష్యంతో హెచ్ఎండీఏ అనుబంధ హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) ఈ నిర్మాణాన్ని చేపట్టింది. గతేడాది సెప్టెంబర్‌లో మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. సుమారు రూ.100 కోట్ల అంచనాలతో ఈ ప్రాజెక్టును రెండు మార్గాల్లో.. నానక్‌రామ్‌గూడ నుంచి తెలంగాణ పోలీస్ అకాడమీ వరకు 8.5 కిలోమీటర్‌లు, కొల్లూరు నుంచి నార్సింగి వరకు 14.5 కిలోమీటర్ల మార్గంలో చేపట్టారు. 5.3 మీటర్‌ల వెడల్పుతో, మూడు లైన్‌లలో ట్రాక్ నిర్మాణపనులు పూర్తయ్యాయి. అన్ని పనులు సకాలంలో పూర్తయితే మార్చి నెలాఖరుకు లేదా ఏప్రిల్ మొదటి వారంలో ట్రాక్‌ను ప్రారంభించే అవకాశం ఉన్నట్లు హెచ్ఎండీఏ అధికారులు తెలిపారు.

ఇక తాయిలాల పర్వం

ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

- ప్రైవేటు ఉపాధ్యాయులు, అధ్యాపకులకు ఎర
- తమ అభ్యర్థికి ఓటు వేయాలని ఒత్తిడి
- ఒక్కో ఓటుకు రూ.5 వేల వరకు చెల్లింపులు
- రేపు జరగనున్న ఎన్నికలకు అంతా సిద్ధం
- బరిలో నిలిచిన 21 మంది అభ్యర్థులు
- గ్రేటర్ జిల్లాలో 67 పోలింగ్ కేంద్రాలు



సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఉమ్మడి రంగారెడ్డి జిల్లా హైదరాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రంతో ముగిసింది. మొత్తం 21 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు అధికారులు రంగారెడ్డి జిల్లాలో 31, హైదరాబాద్‌లో 22, మేడ్చల్‌లో 14 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రిసైడింగ్ ఆఫీసర్లు, సహాయ ప్రిసైడింగ్ ఆఫీసర్లు, ఎన్నికల సిబ్బంది సహా బ్యాలెట్ పేపర్లు ఇతర మౌలిక సదుపాయాలు సమకూర్చారు. ఎన్నికలకు సర్వం సిద్ధం చేశారు.

మందు.. విందు..

ఇప్పటివరకు సభలు, సమావేశాలు, ప్రచారంతో బిజీగా కన్పించిన అభ్యర్థులు.. శనివారం రాత్రి నుంచే తాయిలాలకు తెర లేపారు. మద్యం, మాంసంతో పాటు ఓటుకు నోటు వంటి పంపకాలు కూడా ప్రారంభించారు. ముఖ్యంగా నగర శివారులోని ఇంజినీరింగ్, మెడికల్ కాలేజీలు, ప్రైవేటు అధ్యాపకులు, ఉపాధ్యాయులే టార్గెట్‌గా పంపకాలు చేస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ ఉపాధ్యాయులకు సాయంత్రం మందు, విందులు ఏర్పాటు చేసి, ప్రైవేటు వారికి ఒక్కో ఓటుకు మద్యం సహా రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు గుట్టుగా చెల్లిస్తున్నట్లు తెలిసింది. ఎలాగైనా ఓటర్లను మచ్చిక చేసుకుని, ఎన్నికల్లో గెలుపొందాలని భావించి అడ్డదారులు తొక్కుతున్నారు.

కీలకంగా 'ప్రైవేటు' ఓటర్లు

ఎమ్మెల్సీ నియోజకవర్గం పరిధిలో మొత్తం 29,655 ఓట్లలో 1,265 ఓట్లు మైనారిటీ గురుకులాల్లో, 802 ఓట్లు తెలంగాణ మోడల్ స్కూళ్లలో ఉన్నాయి. 948 ఓట్లు కేజీబీవీల్లో ఉండగా, 480 కోట్లు జ్యోతిరావుపూలే గురుకులాల్లో ఉన్నాయి. 6,204 ఓట్లు ప్రభుత్వ పాఠశాలల్లో ఉండగా, 24 ఓట్లు ఎయిడెడ్ పాఠశాలల్లో, 1,112 ఓట్లు సోషల్ వెల్ఫేర్ స్కూళ్లలో ఉన్నాయి. 89 ఓట్లు టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్‌లో, 236 ఓట్లు టీఎస్‌డబ్ల్యూయూఆర్‌లో ఉన్నాయి. టీడబ్ల్యూఆర్ఎస్‌లో 36, యూఆర్ఎస్‌లో 13 మంది ఓటర్లు, జెడ్పీహెచ్ఎస్ స్కూళ్లలో 13,820 మంది ఓటర్లు ఉన్నారు. కేంద్రీయ, ఇతర స్కూళ్లలో మరో 61 మంది ఓటర్లు ఉన్నారు.

మరో 4,564 మంది ఓటర్లు ప్రైవేటు స్కూళ్లు, కాలేజీలు, ఇంజినీరింగ్, ఇతర ఇనిస్టిట్యూట్‌లలో పని చేస్తున్న పాధ్యాయులు, అధ్యాపకులు ఉన్నారు. అభ్యర్థుల గెలుపు ఓటముల్లో కీలక పాత్ర పోషించనుండటంతో బరిలో నిలిచిన వారంతా ఈ ఓటర్లపై ప్రధానంగా దృష్టి సారించారు. వీరిని ప్రసన్నం చేసుకునేందుకు కొంత మంది డబ్బులు ఆశ చూపున్నారు.

తెర వెనుక ప్రధాన పార్టీల లీడర్లు..

◆ పార్టీలకతీతంగా జరిగే ఈ ఎన్నికల్లోనూ అధికార, ప్రతిపక్ష పార్టీలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. పోల్ మేనేజ్‌మెంట్‌పై అనుభవం ఉన్న ఆయా పార్టీల నేతలు స్వయంగా రంగంలోకి దిగారు. ప్రత్యక్షంగా ప్రచారంలో పాల్గొనకపోయినా.. పరోక్షంగా వారికి సహకరిస్తు న్నారు. ఆర్థిక వనరులను సమకూర్చడం మొదలు..పోల్ మేనేజ్‌మెంట్ వరకు అన్నీ వారే చూసుకుంటున్నారు. ప్రైవేటు యాజమాన్యాలకు స్వయంగా ఫోన్ చేసి తాము సూచించే అభ్యర్థులకు ఓటు వేయించాల్సిందిగా ఆయా కళాశాలల యజమానులపై ఒత్తిడి తెప్పిస్తున్నారు.

◆ అధికార పార్టీకి చెందిన ఓ మంత్రి సహా మరో ఎమ్మెల్సీ ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. వామపక్ష పార్టీ పెద్దలు స్వయంగా రంగంలోకి దిగి పోటీలో లేని ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలకు స్వయంగా ఫోన్ చేసి తమ అనుబంధ సంఘాల అభ్యర్థులను గెలిపించాల్సిందిగా కోరుతు న్నారు. ప్రచార గడువు ముగియడంతో అభ్యర్థులు ప్రస్తుతం వాట్సాప్ గ్రూపులు వేదిగా విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై ఇప్పటి వరకు చేసిన పోరాటాలు.. బ్యాలెట్ పేపర్‌లో తమ సీరియల్ నంబర్, తమనే ఎందుకు గెలిపించాలి? గెలుపొందిన తర్వాత ఉపాధ్యాయుల కోసం ఏం చేయబోతున్నాం? వంటి అంశాలను స్వయంగా రికార్డ్ చేసి ఓటర్లకు షేర్ చేస్తుండటం కొసమెరుపు.

ఏర్పాట్లు పూర్తి: జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్

ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు 739 పోలింగ్ అధికారులు, సిబ్బందిని నియమించినట్లు పేర్కొన్నారు. మొత్తం 137 పోలింగ్ కేంద్రాలు కాగా ఒక్కొక్క పోలింగ్ కేంద్రానికి 137 పి.ఓ లు, 137 ఏ.పి.ఓ లు, 319 ఇతర పోలింగ్ సిబ్బందిని నియమించారు. మొత్తం 593 మంది సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన మెటీరియల్‌ను తీసుకొని పోవడానికి జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎన్ని కల నిర్వహణకు నియమితులైన పోలింగ్ అధికారులు, సిబ్బంది ఆదివారం ఉదయం 8 గంటలకు జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు రావాలన్నారు. రిసెప్షన్ సెంటర్ సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసినట్లు స్పష్టం చేశారు.

చైన్‌స్నాచర్లపై పీడీ యాక్ట్

- జల్సాలు, క్రికెట్ బెట్టింగ్‌ల కోసం వరుస చోరీలు
- ముగ్గురు నిందితుల రిమాండ్
- చర్లపల్లి జైలుకు తరలింపు



నేరస్తులు ప్రసన్నకుమార్, సాయికుమార్, అనిల్‌కుమార్

ఇబ్రహీంపట్నం రూరల్: జల్సాలు, క్రికెట్ బెట్టింగ్‌ల కోసం చేసిన అప్పులు తీర్చేందుకు చైన్‌స్నాచర్లుగా అవతారమెత్తిన ముగ్గురిపై రాచకొండ పోలీసులు పీడీయాక్ట్ నమోదు చేశారు. ఇందుకు సంబంధించి ఆదిబట్ల సీఐ రవికుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పత్తి ప్రసన్నకుమార్(23), పత్తి సాయికుమార్ (20) సొంత అన్నదమ్ములు. తూర్పు గోదావరి జిల్లా కూనవరం మండలం పైడిగూడెం వీరి స్వగ్రామం. ప్రస్తుతం మేడ్చల్‌లో నివాసం ఉంటున్నారు. తుక్కుగూడ మున్సిపాలిటీలోని రావిర్యాల్‌కు చెందిన బుట్టి అనిల్‌కుమార్ (28) వీరికి వరుసకు బావ అవుతాడు. ప్రసన్నకుమార్, సాయికుమార్ క్రికెట్ బెట్టింగ్‌లకు అలవాటు పడి, అప్పుల్లో కూరుకుపోయారు. వీటిని తీర్చేందుకు చైన్ స్నాచింగ్‌లకు పాల్పడాలని పథకం వేశారు. తమ ఆలోచనలను బావ అనిల్‌తో పంచుకున్నారు. ముగ్గురూ కలిసి దొంగతనాలకు సిద్ధమయ్యారు. సీసీ కెమెరాలు లేని ప్రాంతాలను ఎంచుకుని చైన్ స్నాచింగ్‌లు చేయాలని నిర్ణయించుకున్నారు. ఒంటరిగా వెళ్లే మహిళలను టార్గెట్ చేసుకుని, వీరి మెడలోని బంగారు ఆభరణాలను లాక్కుని ఉడాయిస్తున్నారు. గత జనవరిలో ఆరుసార్లు చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడ్డారు. చోరీ సొత్తును ఎల్బీనగర్‌లో విక్రయించారు. వచ్చిన డబ్బుతో అప్పులు తీర్చడంతో పాటు విలాసాలకు అలవాటుపడ్డారు. వీరిపై పక్కా సమాచారం అందడంతో 25 జనవరి 2023న ముగ్గురినీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరినుంచి రూ.78 వేల నగదు, బైకు, మూడు తులాల బంగారు ఆభరణాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పీడీ యాక్ట్ నమోదు చేసి, చర్లపల్లి జైలుకు తరలించారు.

వేధింపులు భరించలేకే

పల్లవి ఆత్మహత్య

- ఏసీపీ ఉమామహేశ్వర్‌రావు
- ఇద్దరు నిందితులు అరెస్టు.. రిమాండ్



క్రాంతి కిరణ్



ప్రణయ్‌కుమార్

ఇబ్రహీంపట్నం రూరల్: గిరిజన యువతి అంగోతు పల్లవి లైంగిక వేధింపుల కారణంగానే మరణించిందని, ఇందుకు కారకులైన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఏసీపీ ఉమామహేశ్వర్‌రావు వెల్లడించారు. కొంగరకలాన్‌కు చెందిన అంతిరామ్, సరిత దంపతుల రెండో కుమార్తె పల్లవి రావిర్యాల్‌లోని వండర్‌లా పార్కులో పని చేస్తుండేది. రోజు ఉదయం 9 గంటలకు వెళ్లి, సాయంత్రం 7గంటలకు వచ్చేది. కానీ ఈ నెల 9న రాత్రి 9 గంటలు దాటినా రాలేదు. తండ్రి ఫోన్ చేయగా స్విచ్చాఫ్ వచ్చింది. తోటి ఉద్యోగులను అడగగా సాయంత్రమే వెళ్లిపోయిందని తెలపడంతో వెంటనే ఆదిబట్ల పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు, కుటుంబ సభ్యులు గాలించినా ఫలితం లేకుండా పోయింది. మరుసటి రోజు ఉదయం రిచ్‌గ్రీన్ వెంచర్లో పల్లవి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఆత్మహత్యకు గల కారణాలను పోలీసులు కుటుంబ సభ్యులను అడగగా.. పల్లవి రెండు నెలలుగా డిప్రెషన్‌లో ఉందని, తోటి ఉద్యోగి క్రాంతికిరణ్ లైంగికంగా వేధించేవాడని, మరో ఉద్యోగి ప్రణయ్‌కుమార్ ప్రేమ పేరుతో ఇబ్బంది పెట్టడంతోనే అఘాయిత్యానికి పాల్పడిందని పల్లవి సోదరి తెలిపింది. ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ స్పష్టంచేశారు.

ఠాణాలకు భవనాలు కావలెను



గ్రేటర్‌లో కొత్తగా 25 కొత్త పోలీసు స్టేషన్ల ఏర్పాటు

- హైదరాబాద్‌లో 13, సైబరాబాద్‌లో 7, రాచకొండలో 5
- పీఎస్‌ల నిర్మాణం కోసం స్థలాలను కేటాయించాలని లేఖ
- అప్పటివరకు అద్దె భవనాలలో స్టేషన్ల నిర్వహణ
- అనువైన వాటి కోసం పోలీసులు వెతుకులాట

సాక్షి, సిటీబ్యూరో: పునర్ వ్యవస్థీకరణలో భాగంగా గ్రేటర్ హైదరాబాద్‌లో కొత్త పోలీసు స్టేషన్లు, డివిజన్లు, జోన్లను ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వం.. వాటికి అవసరమైన సదుపాయాలను మాత్రం కల్పించలేదు. ఠాణాల నిర్మాణం కోసం అనువైన స్థలాలను కేటాయించాలని పోలీసు ఉన్నతాధికారులు ప్రభుత్వానికి లేఖలు రాశారు. అయినప్పటికీ స్థలాలను కేటాయించకపోవటంతో.. అద్దె భవనాలలో కార్యకలాపాలు నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ప్రస్తుతం కార్యాలయాల అద్దెలు పెరిగిన నేపథ్యంలో కొత్త ఠాణాలకు భవనాల ఎంపిక పోలీసులకు తలనొప్పిగా మారింది.

ప్రభుత్వానికి లేఖ..

పెరిగిన జనాభా, వ్యవస్థీకృత నేరాలు, ఇతర సామాజిక అంశాలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో కొత్తగా 13, సైబరాబాద్‌లో 7, రాచకొండలో 5 పీఎస్‌లను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఆయా అధికారులకు అవసరమైన భవనాల నిర్మాణం కోసం అనువైన స్థలాలను కేటాయించాలని కోరుతూ మూడు కమిషనరేట్ల పోలీసు ఉన్నతాధికారులు రెవెన్యూ విభాగానికి లేఖలు రాశారు. అప్పటివరకు ప్రైవేటు భవనాలను లీజు ప్రాతిపదికన అద్దెకు తీసుకొని కార్యకలాపాలు సాగించాలని నిర్ణయించారు.

భవనాల కోసం శోధన..

కొత్త ఠాణాల నిర్వహణకు అవసరమైన భవనాల కోసం అధికారులు వెతుకుతున్నారు. ఒక్కో ఠాణాలో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, సెక్టార్ల ఆధారంగా 4 నుంచి 5 మంది ఎస్ఐలు, 40–50 మంది కానిస్టేబుళ్లు, వాహనాలు నిలిపేందుకు అనువుగా ఉండాలి. ఫిర్యాదుదారులు వచ్చినప్పుడు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఉండాలి. కనీస సౌకర్యాలున్న పాత ఠాణాలు, కమ్యూనిటీహాళ్లు, ప్రభుత్వ గృహాలతో పాటు ఫోన్ కాల్ రాగానే వెంటనే స్పందించేలా జనావాసాల మధ్య పీఎస్‌లు ఉండాలనే ఉద్దేశంతో కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలలో కూడా భవనాల కోసం వెతుకుతున్నామని ఓ పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. అనుకూలంగా ఉన్నట్టు భావిస్తే లీజు ప్రాతిపదికను ఆయా భవనంలో ఠాణాలను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.

కుర్చీలు లేక తిరుగుతూ..

కొత్త ఠాణాలతో పాటు మూడు కమిషనరేట్లలో కొత్తగా 12 డివిజన్లు, 4 జోన్లు కూడా ఏర్పాటయ్యాయి. ఏసీపీ, డీసీపీ అధికారులను సైతం ప్రభుత్వం నియమించింది. ఆయా అధికారులకు కూడా కార్యాలయాలు లేవు. పలు డివిజన్లలో ఏసీపీలకు కూర్చునేందుకు కుర్చీలు కూడా లేకపోవటం విడ్డూరం. దీంతో ప్రతి రోజు ఆయా డివిజన్ పరిధిలోని ఏదో ఒక పోలీసు స్టేషన్‌లో నిర్వహణ, రికార్డుల పరిశీలన పేర్లతో ఠాణాల నుంచే విధులను నిర్వహిస్తూ కాలం వెల్లదీస్తున్నారు. ఓ డివిజన్‌లో అయితే ఏసీపీ ఇంకా బాధ్యతలు చేపట్టకపోవటం గమనార్హం.

రైల్వే స్టేషన్లలో జీఎం తనిఖీలు

సాక్షి, సిటీబ్యూరో: దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ శనివారం సికింద్రాబాద్, బేగంపేట్ రైల్వేస్టేషన్‌లలో తనిఖీలు నిర్వహించారు.ఆయనతో పాటు సికింద్రాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ ఏకే గుప్తా, ఇతర ఉన్నతాధికారులు తనిఖీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రయాణికుల సదుపాయాలను జీఎం పరిశీలించారు. బేగంపేట్ స్టేషన్ అభివృద్ధి ప్రణాళికలపై అధికారులతో చర్చించారు. ప్రయాణికుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. బేగంపేట్ లో ఏర్పాటు చేసిన వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్ స్టాల్‌ను, రాక్ గార్డెన్‌ను జీఎం సందర్శించారు. సికింద్రాబాద్ స్టేషన్ పునరభివృద్ధి పనులను సమీక్షించారు.

ప్రేమ వ్యవహారంతోనే హత్య

- పోలీసుల విచారణలో వెల్లడి
- నిందితుల రిమాండ్
- కత్తులు, సెల్‌ఫోన్లు స్వాధీనం

పహాడీషరీఫ్: ప్రేమ వ్యవహారం గిట్టకనే యువతి కుటుంబ సభ్యులు గిరిజన యువకుడిని హత్య చేసినట్లు బాలాపూర్ పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ ఘటనతో ప్రమేయమున్న ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. మహేశ్వరం డీసీపీ శ్రీనివాస్, ఏసీపీలు అంజయ్య, ఉమా మహేశ్వర్‌రావు, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌లతో కలిసి తన కార్యాలయంలో కేసు వివరాలు వెల్లడించారు. నాగర్‌కర్నూల్‌కు చెందిన డెగావత్ పూల్‌సింగ్ 20 ఏళ్ల క్రితం నగరానికి వలస వచ్చాడు. మూడేళ్లుగా వాదే ఉమర్ బస్తీలో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో పూల్‌సింగ్ కుమార్తె స్నేహితురాలితో పూల్‌సింగ్ కుమారుడు పవన్ నాయక్(22) పరిచయం పెంచుకుని ఫోన్ మాట్లాడటం ప్రారంభించాడు. విషయం తెలుసుకున్న యువతి కుటుంబ సభ్యులు తమ మకాంను పహాడీ షరీఫ్‌కు మార్చినప్పటికీ.. వీరి నడుమ ఫోన్ వ్యవహారం కొనసాగింది. యువతి బాబాయి మహ్మద్ గౌస్ (30) విషయం తెలుసుకొని పవన్‌ను హెచ్చరించాడు. అనంతరం తనకు పరిచయస్తుడైన ఓ యూట్యూబ్ చానల్ చైర్మన్ మహ్మద్ మహమూద్(32) దృష్టికి తీసుకెళ్లాడు. ఇదే అదునుగా భావించిన మహమూద్ కేసును పోలీసుల దృష్టికి తీసుకెళ్తే కటకటాల పాలవుతావని.. అలా కాకుండా రూ.5 లక్షలు చెల్లించి సెటిల్ చేసుకోవాలని సూచించాడు. ఈ విషయాన్ని పవన్ కుటుంబ సభ్యులకు కూడా చెప్పడంతో వారు వచ్చి.. తాము పేదొళ్లమని రూ.50 వేల వరకు ఇస్తామని అభ్యర్థించారు. చివరకు రూ.3 లక్షలైనా ఇవ్వాలనడంతో రాజీ కుదరలేదు. డబ్బులు రాకుండాపోయాయన్న అక్కసుతో ఈ నెల 8న మహమూద్ యువతి కుటుంబ సభ్యులను రెచ్చగొట్టాడు. ఈ క్రమంలోనే అదే రోజు రాత్రి పవన్ ఇంటి వద్ద గౌస్, తన స్నేహితుడు మహ్మద్ సద్దాం(23)తో కలిసి కాపు కాశాడు. రాత్రి 11.45 గంటల సమయంలో మూత్ర విసర్జనకు బయటికొచ్చిన పవన్‌ను బరాత్‌లో నృత్యం కోసం నాందేడు నుంచి తెచ్చుకున్న రెండు కత్తులతో నరికి చంపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులపై హత్య, ఎస్సీ, ఎస్టీ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కత్తులు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

ఆపదలో అండగా..

- ఓఆర్ఆర్ చుట్టూ 'ట్రామా కేర్' సెంటర్లు
- రోడ్డు ప్రమాద బాధితులకు సత్వర వైద్య సేవలు
- రెండేళ్లుగా వందలాది మందికి చేయూత

ఔటర్ రింగ్ రోడ్డు, సర్వీస్ రోడ్లపై ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నవారికి అత్యవసర వైద్య సేవలు అందిస్తూ ప్రాణాలు నిలుపుతున్నాయి ట్రామా కేర్ సెంటర్లు. ఓఆర్ఆర్ చుట్టూ ఏర్పాటు చేసిన 16 కేంద్రాల ద్వారా రెండేళ్లుగా వందలాది మంది క్షతగాత్రులకు అండగా నిలిచి ధైర్యం ఇవ్వడంతో పాటు అవరమైన ట్రీట్‌మెంట్ అందించారు.



తుక్కుగూడలో ఓఆర్ఆర్ టోల్ వద్ద ట్రామా కేర్ సెంటర్

తుక్కుగూడ: ట్రామా కేర్ సెంటర్లతో క్షతగాత్రులకు సకాలంలో ప్రథమ చికిత్స అందుతోంది. ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్)లో నిత్యం ఏదో ఒక చోట ప్రమాదాలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో బాధితులకు సకాలంలో వైద్యం అందించాలనే సంకల్పంతో ఓఆర్ఆర్ నిర్వాహకులు ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఓ ప్రైవేట్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిరంతర వైద్య సేవలు అందిస్తున్నారు.

ఇప్పటికే 16 కేంద్రాలు..

ఔటర్ చుట్టూ 19 టోల్స్‌ను ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన కార్యాలయాల్లోనే 16 ట్రామా కేర్ సెంటర్లను కొనసాగిస్తున్నారు. ఇప్పటి వరకు శంషాబాద్, పెద్దగోల్‌కొండ, తుక్కుగూడ, రావిర్యాల, బొంగ్లూర్, పెద్దఅంబర్‌పేట, తారామతిపేట, ఘట్‌కేసర్, శామీర్‌పేట, మేడ్చల్, అప్పాజంక్షన్, పటాన్‌చెరు, దుండిగల్ తదితర ప్రాంతాల్లో రెండేళ్ల క్రితం సెంటర్లు ప్రారంభించారు.

అందుబాటులో వైద్య సేవలు..

ట్రామా కేర్ సెంటర్ల ద్వారా ఔటర్ రింగు రోడ్డు, సర్వీస్ రోడ్డులో ప్రమాదాలకు గురైన వారికి ప్రథమ చికిత్స అందిస్తారు. ప్రథమ చికిత్స చేయడానికి వైద్య సిబ్బంది, బెడ్లు, ఆక్సిజన్ పరికరాలు, బీపీ మందులు తదితర పరికరాలు అందుబాటులో ఉంటాయి. క్షతగాత్రులను తీసుకురావడానికి అంబులెన్స్ సౌకర్యం ఉంటుంది. గాయపడిన వారికి మరింత మెరుగైన వైద్య సేవలను అందించడానికి డ్యూటీలో ఉన్న సిబ్బంది, వైద్యులకు అపోలో ఆస్పత్రి నుంచి సంబంధిత సీనియర్ డాక్టర్లు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వస్తారు. గాయపడిన వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉంటే.. ఇతర ప్రాంతాలకు పంపిస్తారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి ప్రథమ చికిత్స అందించడానికి ట్రామా కేర్ సెంటర్లు కీలక పాత్ర పోషిస్తున్నాయి.

ప్రథమ చికిత్స అందిస్తున్నాం



ఔటర్ రింగు రోడ్డులో ప్రమాదానికి గురైన వారి కోసం అపోలో ఆస్పత్రి ఆధ్వర్యంలో ట్రామా కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. నిత్యం వాహనదారులు రోజు ఏదో ఒక చోట ప్రమాదాలకు గురవుతుంటారు. వీరికి ప్రాథమిక చికిత్స అందించి, అవసరమైన వారిని మెరుగైన సేవలకోసం అంబులెన్స్‌లలో ఆస్పత్రికి తరలిస్తాం.

– ఎంఏ బారీ, ట్రామా ఉద్యోగి

సేవలు భేష్



ప్రమాదాలకు గురవుతున్న క్షతగాత్రులకు ఓఆర్ఆర్ ట్రోల్ సెంటర్ల వద్ద ఉన్న ట్రామా కేర్ సెంటర్ల ద్వారా వైద్యం చేస్తున్నారు. తక్షణమే అందుతున్న వైద్య సేవల కారణంగా ఎంతోమంది ప్రాణాలు నిలబడుతున్నాయి. ట్రామా సేవలు చాలా బాగున్నాయి. బాధిత కుటుంబ సభ్యులు అనేక మంది ప్రత్యేకంగా వచ్చి ట్రామా సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

– శేఖర్‌గౌడ్, ఓఆర్ఆర్ ఉద్యోగి

అందని 'రైతుబంధు'

- పదెకరాలకు పైగా భూమి ఉన్న రైతుల ఖాతాల్లో జమకాని నగదు
- ఇప్పటి వరకు 2,94,788 మంది అకౌంట్లలో రూ.306.43 కోట్లు క్రెడిట్
- యాసంగి సాయంకోసం 4,404 మంది ఎదురుచూపు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: మోతుబరి రైతులు, భూస్వాములకు సంబంధించిన యాసంగి సీజన్ రైతుబంధు డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదు. చిన్న, సన్నకారు రైతులకు సాగు సాయం అందజేసిన సర్కారు.. పదెకరాలకు పైగా భూమి కలిగి ఉన్న వారికి డబ్బులు వేయలేదు. దీంతో వారంతా రైతుబంధు కోసం వ్యవసాయ అధికారుల ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వం వీరి ఖాతాల్లో నగదు వేస్తుందో? లేదో తెలియక అధికారులు కూడా తలపట్టుకుంటున్నారు. తమ వద్దకు వచ్చిన రైతులకు ఏం చెప్పాలో? అర్థంకాక వారిని చూడగానే ముఖం చాటేస్తున్నారు.

రైతుల్లో ఆందోళన

పెట్టుబడి సాయం కింద 2018 వానాకాలం సీజన్ నుంచి ప్రభుత్వం ఎకరాకు ఏటా రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తోంది. ఈఏడాది యాసంగి సీజన్‌కు సంబంధించిన డబ్బులను 2020 డిసెంబర్ చివరి వారం నుంచి ఖాతాల్లో వేయడం ప్రారంభించింది. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 3,03,176 మంది రైతులు పోర్టల్‌లో తమ పేర్లు నమోదు చేసుకున్నారు. వీరిలో 2,99,192 మంది మాత్రమే బ్యాంక్ అకౌంట్ నంబర్లు జత చేశారు. వీరికి రూ.337 కోట్లకుపైగా చెల్లించాల్సి ఉంది. ఇప్పటి వరకు 2,94,788 మంది రైతుల అకౌంట్లలో మాత్రమే రూ.306.43 కోట్ల నగదు జమైంది. మరో 4,404 మంది రైతుల ఖాతాల్లో ఇంకా నగదు జమకావాల్సి ఉంది. రైతుబంధు నగదు చెల్లింపు ప్రారంభమై రెండు నెలలు దాటినా ఇప్పటికీ తమ ఖాతాల్లో డబ్బు పడకపోవడంపై రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

జిల్లాలో రైతుబంధు చెల్లింపులు ఇలా

సంవత్సరం	సీజన్	రైతులు	చెల్లింపు రూ.కోట్లలో
2018	వానాకాలం	247694	255.29
2018	యాసంగి	221116	240.46
2019	వానాకాలం	230155	257.16
2019	యాసంగి	211994	208.96
2020	వానాకాలం	269077	342.91
2020	యాసంగి	274785	344.36
2021	వానాకాలం	282646	343.96
2021	యాసంగి	293599	343.86
2022	వానాకాలం	304111	343.97
2022-23	యాసంగి	294788	294.78

ట్రెజరీలో జమ చేశాం

రైతుబంధు సాయంపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. దశలవారీగా ప్రభుత్వం రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తోంది. ఇప్పటికే 95శాతం మందికి చెల్లింపులు పూర్తయ్యాయి. మిగిలిన కొద్ది మందికి కూడా నిధులు కేటాయించి, ఆ మేరకు ట్రెజరీలో జమ చేసింది. త్వరలోనే నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది. ఈ నెలాఖరు వరకు రైతులందరి ఖాతాల్లో నగదు జమవుతుంది.

– గీతారెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి

దర్యాప్తు అధికారులకు సీపీ అభినందనలు



అభినందిస్తున్న కమిషనర్ సీవీ ఆనంద్..

బంజారాహిల్స్: ప్రముఖ పారిశ్రామికవేత్త, ప్రవాసాంధ్రుడు చిగురుపాటి జయరాంను దారుణంగా హత్య చేసిన నిందితుడు రాకేష్‌రెడ్డికి జీవిత ఖైదు పడటంలో విశేష కృషి చేసిన ఆ కేసు దర్యాప్తు అధికారులను నగర పోలీస్‌కమిషనర్ సీవీ ఆనంద్ పోలీస్‌కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అభినందించారు. ఎన్నో అడ్డంకులు, బెదిరింపులు ఎదురైనా ఏ మాత్రం వెనక్కి తగ్గకుండా న్యాయస్థానానికి నిందితుడికి సంబంధించిన శాస్త్రీయ ఆధారాలను సమర్పించి శిక్ష పడటంలో అప్పటి బంజారాహిల్స్ ఏసీపీ, దర్యాప్తు అధికారి కే.ఎస్.రావు, సైఫాబాద్ ట్రాఫిక్ సీఐ రమేష్, జూబ్లీహిల్స్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐలు శివశంకర్, చంద్రశేఖర్‌తో పాటు పబ్లిక్ ప్రాసిక్యూటర్లను, కోర్టు సిబ్బందిని సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.